ఈవారం కథ

# తెర

వై. రాంబాబు & సాయి

నయవంచనకు గురైన తల్లి బతుకు చీకటి చేసుకుంటే, అదే మోసానికి గురైన ఆమె కూతురు బతుక్కు కొత్త అర్థం చెప్పింది.

మబ్బు తెరతీసింది.

చురుకెక్కిన ఎండ చుర్రు మనిపిస్తోంది. గాలిపాదాలు ఊబిలో చిక్కుకుపోయినట్టు ప్రవాహగుణం కరవైంది. అంతులేని దాహం ఎదురెక్కి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఎదురింటి మీదా, పక్కనున్న చెట్టు పచ్చని ఆకుల మీదా, కిటికీ రెక్క గోధుమరంగు నగిషీపైనా, దూరంగా పారిపోయిన టెలిఫోన్ సన్నని తీగ మీదా- ఎక్కడ చూసినా ఎర్రని ఎండ పాకుతూ వెచ్చని ఆవిర్లూదుతోంది.

వాలు కుర్చీలో జారగిలబడిన యామిని మెదడు పొరల్లో నిన్న సాయంకాలం జరిగిన సన్మానసభ జ్ఞాపకాలు తాజాగా నెమరుకు వస్తున్నాయి.

ఆ థియేటర్‌లో వేసిన అందమైన కుర్చీల్లో సుఖాసీనులై- వేయిమందికి పైగా ప్రేక్షకులు రంగస్థలం మీద జరుగుతున్న కార్యక్రమాన్ని చూస్తున్నారు. వాళ్ళ కాళ్ళకింద నిశ్శబ్దం ఎర్ర తివాచీలా పరచుకుంది. ప్రజా ప్రతినిధి ఒకరు నాటక కళ ప్రాధాన్యత గురించి, తన గురించి- తనకంతా తెలిసున్న వైఖరిలో అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. ఒక్కొక్క వాక్యానికి నాలుగైదు ఊత పదాలే వినిపిస్తున్నాయి.

ఆయన తన నాటకం ఎప్పుడైనా చూశాడో లేదో- తను మహానటివని, నవరసాలు అవలీలగా ఒలికిస్తావని, ఎవరూ సాటిరారని చెబుతున్నాడు. చక్రవర్తులు కూర్చునే మణిమయ సింహాసనం వంటి పెద్ద కుర్చీలో తనను కూర్చోబెట్టారు. పొడుగాటి లాల్చీ, బుర్రమీసాలు, భారీ శరీరం- ఆయనో కవి కాబోలు- బుగ్గన కిళ్ళీ నిద్రలోనైనా తప్పదు కాబోలు- పంచరత్నాలు దుర్యోధన పాత్రధారిలా పాడేడు. 'కళాశారద' అంటూ బిరుదు ప్రకటించాడు. ఎందరెందరో పూలహారాలు, ఎంతో స్వతంత్రంగా తన మెడలో వేశారు. అందులో మహిళలూ ఉన్నారు, యువకులూ ఉన్నారు. తను పులకించిపోయింది.

ఇన్నాళ్ళకు తన నటనా వైదుష్యాన్ని గుర్తించి, గుండెలకు హత్తుకుని ఎంతో ఆదరంగా తనను కీర్తించడం యామినికి అంతులేని సంతోషం కలిగించింది. నిలువెత్తు దండలు తన మెడలో పడి తనను భూమి మీదకు క్రుంగదీస్తున్నాయి. చిత్రాలు తీసే చిన్న వాళ్ళు వెలుగులు కురిపించారు. ఒళ్ళు తెలియని తమకంతో మైకును చేత్తో అందుకుంది యామిని.

తన పట్ల ప్రేమాదరాలు కురిపిస్తూ హర్షాతిరేకాలు ప్రకటించిన వారందరికీ ఎంతో వినయంగా నమస్కరించింది. అందరికీ కృతజ్ఞతలు చెబుతూ- ఇన్నేళ్ళ నటనానుభవంతో కలిగిన స్పందనలను గుదిగుచ్చి అందంగా చెప్పాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. సభలో పాల్గొన్న పెద్దలకు, హాజరైన అభిమానులకు తన నటజీవితంలో అద్భుత విజయాలు సాధించడానికి సహకరించిన వారికి, తనను నటిగా గుర్తించిన వారికి, తనతో బాటు రంగస్థలంపై అభినయ కౌశలం ప్రదర్శిస్తూ ఆదరాభిమానాలు రుచిచూపిన వారికి, సత్కారం ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యులకు, తనను తీర్చిదిద్దిన దర్శకులకు- ఎలా ప్రారంభించాలో తెలియని తికమక. ఆనందం ఉవ్వెత్తున పొంగిపొరలుతున్న తన్మయత్వం- ఆలోచనలో సముద్ర కెరటమై పైకిలేచింది.

ఆమె తనముందున్న వారిపై చూపు నిలిపింది. ఎదుటి వరుసలో తననే గుచ్చి చూస్తున్న అతను- అవును!!! అతను- అతనే!!!

ఆమె ఆలోచనలన్నీ కాళ్ళు తెగిన పేడీపిల్లల్లా కూలిపోయాయి. ఇంతవరకు తనువంతా అలమిన పులకింత క్రమంగా జారిపోయింది. తన సామాజిక జీవితానికి పెద్ద విఘాతమై- నలుగురి నుంచీ దూరంగా తనను తరిమివేసిన ఆయన వంచకుడు-తన ఎదురుగ్గా- ముందు వరుసలో.....

ఆమె నిలువెల్లా ఒణికిపోతూ- అవుకోలేనంత ఆర్తితో- భోరున ఏడుస్తూ- అదీ ఒక్కక్షణం. తమాయించుకుంది. చేతిలో నుంచి జారిపోతున్న మైక్‌స్టాండ్‌ను గట్టిగా పట్టుకుంది. మన్నించమని కోరింది. ఎన్నోఏళ్ళ తన కృషిని గుర్తించి అపూర్వ సత్కారం జరుపుతున్న వేళ- మనస్సు నిబ్బరించుకోలేకపోయానని చెప్పింది. కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తనకు తెలియడం లేదంది. అపూర్వమైన ఆదరాభిమానాలు చూపిన వారందరికీ తాను జీవితాంతం ఋణపడి ఉంటానంది. ఆకస్మికంగా ఉపన్యాసం ముగించి, కుర్చీ వరకు ఎలా నడిచిందో- ఎలా కూర్చోగలిగిందో- తడబడుతూ కూర్చుని, ఊపిరి పీల్చుకుంది.

"అమ్మా!" అన్న పిలుపు.

ఆమె నిన్నటి జ్ఞాపకాల్లో ఉండగా ఆ పిలుపు పదేపదే తట్టిలేపింది.

ఉలిక్కిపడి కళ్ళు విప్పింది యామిని.

ఎదురుగా పన్నెండేళ్ళ పవిత్ర- తనకు సాయపడే బుల్లి స్నేహితురాలు.

"ఏరా పవిత్రా!"

"ఎవరో యిద్దరు మీ కోసం వచ్చారమ్మా! మాట్లాడాలంట- చాలా సేపట్నించి ఎదురు చూస్తున్నారు-"

చకచకా డ్రెస్సింగ్ రూంలోకి వెళ్ళింది యామిని. నిలువెత్తు అద్దంలో- కన్నీటి చారికలతో విషాదం అలముకున్న తన ముఖం తనకే చిత్రంగా కనిపించింది. సెకన్లలో ఫ్రెష్ అయింది.

విజిటర్స్ రూం-

యామినిని చూస్తూనే ఇద్దరూ లేచి నిలబడ్డారు-. నమస్కారాలు చెప్పారు.

"నా పేరు త్రినాథస్వామి- జర్నలిస్టుని-" వేలాడుతున్న కెమెరా బేగ్ సవరించుకుంటూ- ఇరవై ఆరేళ్ళ ఒకమాదిరి పొట్టిగా- అందంగా నవ్వుతూ- చామనచాయగా- అతను.

"నన్ను గాంధీ అంటారు- రచయితను-" సన్నగా పొడుగ్గా, జారిపోతున్న కళ్ళజోడు సవరించుకుంటూ- మరో చేత్తో పుస్తకంతో- రెండో వ్యక్తి- కొంచెం ముదురు వయస్సులో.

"కూర్చోండి" అంది యామిని తాను కూర్చుంటూ... మేకప్ సరిగా లేనప్పుడు ఏ మహిళ అయినా వయస్సు దాచుకోలేదు- అనుకున్నాడు త్రినాథస్వామి. తన ఇంప్రెషన్ కనబడనీయకుండా, చిరునవ్వు వెనక దాచేసి- "నిన్న సాయంకాలం ఫంక్షన్‌లో మిమ్మల్ని మీరు కంట్రోల్ చేసుకోవడం కొంచెం కష్టమైనట్టుంది- మామూలుగా ఏ సన్మాన వార్త నిన్నే ఇచ్చేశాను- ఇవాళ పేపర్ చూశారు గదా- మళ్ళీ ఏమన్నా చెబుతారేమోనని..." అంటూ...

స్వామి మాటల్ని మధ్యలోనే కట్ చేస్తూ- "థాంక్‌యూ మిస్టర్ స్వామి! మీ జర్నలిస్టులు నా కెరీర్‌లో ఎంతో సహకరించారు. నామీద మీకందరికీ అభిమానం, నేను మీకు చాలా రుణ పడి ఉన్నాను" అని ఏదో చెప్పబోయి- "మిమ్మల్ని ఇంతకుముందెప్పుడూ చూడ లేదు" అంది యామిని- గాంధీని చూస్తూ.

"అవును యామినిగారూ మీ లైఫ్ హిస్టరీ బేస్ చేసుకుని ఒక నవల ప్లాన్ చేద్దామని ఉంది- అదీ మీరనుమ తిస్తేనే. మీకెప్పుడు వీలవుతుందంటే అప్పుడు కలుస్తాను. ఓ రెండు గంటలు కూచుంటే చాలు..." చాలా బ్రీఫ్‌గా చెప్పాడు గాంధీ.

"మీ కథలు చదువుతున్నాను-'నేను మీ ఫేన్‌ని" అంది యామిని.

గాంధీ థాంక్స్ చెప్పాడు.

పవిత్ర వచ్చింది. దగ్గరగా నిలబడి గుసగుసగా ఏదో చెప్పింది. యామిని ముఖంలో ఒక వింతరేఖ. కొంచెం చీకాకు.


జర్నలిస్టూ, రచయితా ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"మేడమ్- మళ్ళీ కలుస్తాం. అవ సరం అనుకుంటె ఓ గంటలో ఫోన్ చేస్తాను" అన్నాడు స్వామి.

ఇద్దర్నీ అనుసరిస్తూ యామిని వచ్చింది. గుమ్మం దగ్గర ఎస్.ఐ- స్వామి ఆయన్ను పలకరించి, కళ్ళతోనే విశేషం అడిగాడు. పాదాల కదలిక ఆగలేదు.

"అయాం సారి- మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్టున్నాను-" అన్నాడు ఎస్.ఐ శివ శంకరమూర్తి.

"డిస్టర్బేన్సా- రండిరండి- ఏదో పని




లేనిదే రారు గదా!" అంది యామిని సంశయిస్తూనే.

హాలులోంచి విజిటర్స్ రూమ్ చేరు కునే లోపల "అమ్మాయినోసారి పిలి పించండి-" అని అడిగాడు ఎస్.ఐ

యామిని తడబడింది. పోలీసుల ముందు తడబాటు మంచిదికాదని ఆమెకు తెలుసు- "మా అమ్మాయితో పనేమిటి యస్సైగారూ!" అడిగేసింది.

"ఒకసారి మాట్లాడాలి-"

"నాతో చెప్పండి-".

"ఇదేమంత ఇంపార్టెంట్ కాదు- మీరోసారి అమ్మాయిని పిలవండి-"

"అమ్మాయి ఊరికెళ్ళింది ఎస్సైగారు. సాయంకాలం గానీ, రేపు ఉదయం గానీ వస్తుంది"

"రాగానే నాకు ఫోన్ చేయించగ లరా?" అంటూ లేచాడు మూర్తి.

"ష్యూర్- ఇంతకూ- అమ్మాయితో పనేమిటో-"

ముందడుగు వేసినవాడల్లా వెనక్కు తిరిగి- "రాత్రి మీ అమ్మాయి ఎక్క డుందో తెలుసుకోవాలి" అన్నాడు- యామిని కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూస్తూ-

ఫోన్ చేయించమని మళ్ళీ ఓసారి చెప్పి బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

అతనటు వెళ్ళిన రెండు నిమిషాలకు స్వామి ఫోన్- ఎస్సై వచ్చిన కారణం ఎంక్వైర్ చేస్తూ- ఫోన్ వస్తుందని యామిని అనుకున్నదే.

"జర్నలిస్టులకు అన్ని విషయాలూ తెలుస్తాయి. ఆయనెందుకు వచ్చాడో మీరే చెప్పాలి" అంది యామిని.

"ఏంలేదు- గిరిబాబు కనిపించడం లేదని ఎం.పిగారు పోలీస్ రిపోర్టు ఇచ్చారు. బహుశా గిరిబాబు నెవరో మర్డర్ చేశారని వదంతి-"

యామిని ఉలిక్కిపడింది- "మర్డరా?"

"గిరిబాబుకు మీ పావనికి మంచి స్నేహం. ఎస్సై అందుకే వచ్చాడేమో!"

యామిని ఫోన్ పెట్టేసింది. ఆమె కళ్ళముందు దృశ్యాలన్నీ క్రమంగా అల ముకుపోతున్నాయి. సోఫాలో కూల బడి పోయింది.

గుంటూరులో తన స్నేహితురాలు

కల్వార ఉంటోందని, నాలుగు రోజులు ఆమెతో ఉంటానని చెప్పి పావని వెళ్ళింది. వెళ్ళి నాలుగు రోజులైంది.

పావని, గిరిబాబు మంచి స్నేహితులు. వాళ్ళ పెళ్ళికి యామిని అంగీకరించింది కానీ– గిరిబాబు తల్లిదండ్రులు ససేమిరా కుదరదన్నారు. దాడీకి, మమ్మీకి నచ్చజెప్పి నిన్ను తప్పక పెళ్ళి చేసుకుంటానన్నాడని పావని తల్లికి చెప్పింది.

ఇప్పుడీ పిడుగులాంటి వార్త.

మెదడంతా ఫ్రీజ్ అయినట్టు– కళ్ళ ముందంతా చీకటే ధారగా కురుస్తున్నట్టుంది. యామిని లేచి నిలబడింది. మెల్లగా అటూఇటూ తిరగడం ప్రారంభించింది. కిటికీ దగ్గర నిలబడింది. చూపులు బయటకురికి, దూరంగా పరుగెత్తాయి. అక్కడ– నీడలో– ఎవరో!! కూర్చున్నారు. బహుశా మఫ్టీలో పోలీస్ అయి ఉండొచ్చనుకుంది యామిని.

అంటే– పోలీసుల దృష్టిలో నిన్న రాత్రి జరిగిన మర్డర్‌కీ, పావనికీ సంబంధం ఉందనేగా!

యామిని తన టెలిఫోన్ బుక్‌లో కల్వార నెంబర్ కోసం వెదికింది. పావని గదిలోకి వెళ్ళి, కాగితాలన్నీ చూసింది.

టెలిఫోన్ చేతిలోకి తీసుకుంది. నంబర్లు ప్రెస్ చేసింది. కల్వార కావాలని అడిగింది.

అవతల మగగొంతు:

“మీ అమ్మాయిని కలుసుకోవాలని నాలుగు రోజుల క్రితమే కల్వార రాజమండ్రి బయలుదేరిందండీ–”

రోహిణీ కార్తె ఎండ రోళ్ళు బద్దలు కొడుతోంది. ఆమె మనస్సులో మాత్రం డైనమైట్లు పేలుతున్నాయి.

క్షణం కూచుంటుంది, మరుక్షణం అటూఇటూ తిరుగుతోంది. చిటుక్కుమంటే చాలు గుమ్మం వంక చూస్తోంది. పావని– కల్వార ఏమయ్యారో తెలీదు.

జీవితంలో తానెన్నో కష్టాలు అనుభవించింది. తనను చేసుకుంటానన్న వాడు చేసిన బాసలు మరచి చివరి నిమిషంలో తనను వదిలించుకోవాలని ప్రయత్నించాడు. అప్పటికే తన కడుపులో పసిపాప రూపం ఏర్పడింది. ప్రేమ ఒలికించి, తీయగా మాట్లాడి, సర్వస్వం దోచుకునీ, ప్రేమ ఫలితం తెలిసిన మరుక్షణం తనకేమీ తెలియదన్నాడు. అమ్మా–నాన్నా ఒప్పుకోరన్నాడు. ఆస్తి చిల్లిగవ్వ కూడా ఇవ్వనని బెదిరించే కన్న తండ్రి మాట జవదాటలేనన్నాడు. ఏడ్చి మొత్తుకుంది. ఏమీ ఫలితం కనిపించలేదు. యామినికి తండ్రి లేదు. తల్లి తొలి నుంచీ హెచ్చరిస్తూనే ఉంది.

అన్ని ప్రయత్నాలూ విఫలమై, నలుగురికీ ముఖం చూపించలేక, ఉన్న ఊరు విడిచి, గౌతమీ తీరానికి తరలి వచ్చేసింది యామిని. పాప పుట్టిన తరువాత నాటకాల్లో వేషాలు వేయడం మినహా బతుకు దెరువుకు మరో మార్గం కనిపించలేదు. ఎవరి వలలోనూ పడకుండా తనని తాను రక్షించుకోవడం ఆ తరవాతైనా కష్టమైంది. వయస్సు తెచ్చిన అందాలు మగరక్షణ లేకపోతే పరాయి కళ్ళలోపడి పదేపదే భయపెట్టాయి. రంగస్థలంపై మంచి అవకాశాలు వచ్చాయి.

చాలాకాలం కూతురుకు తన గత చరిత్ర గురించి తెలియనీయలేదు. కాలేజీలో చేరిన కొన్నాళ్ళకు పావని తల్లిని నిలదీసింది. “మీ నాన్న సన్యాసుల్లో కలిసిపోయాడమ్మా!” అని అబద్ధమాడింది యామిని. ఎప్పటికో అప్పటికి నిజం తెలుస్తుందని ఆమెకు తెలుసు. నిజం తెలిసి పావని నిగ్గదీసినా, యామిని చిరునవ్వే సమాధానంగా విసిరింది.

రమణమూర్తి కూతురును కలుసుకుని, తప్పంతా ‘మీ అమ్మదే’ అని చెప్పాడని చాలాకాలం వరకు పావని తల్లికి చెప్పలేదు.

“ఆ కట్టుకథ నేను నమ్మలేదమ్మా! నిజం తెలుసుకోవడం కోసం ఆ దుర్మార్గుడు చెప్పిన కథ నమ్మినట్టు కనిపించాను. కన్న కూతురిని ఎరగా వేసి ఆ త్రాష్టుడు పబ్బం గడుపుకోవాలని చూశాడు. అప్పుడు నా తడాఖా చూపించాను” అని ఓ రోజున పావని చెప్పింది.

గిరిబాబుతో పరిచయం ప్రేమగా ఎదిగి, కడకు అదీ విఫలమయ్యే స్థితికి వచ్చిన సంగతి పావని తల్లికి చెప్పలేదు. ఒకరోజు పావని రాత్రి బాగా పొద్దుపోయాక ఇంటికి వచ్చింది. తాగిన మైకంలో మెట్లమీంచి తూలిపడింది. ఆ తరువాత మత్తులో కలవరించింది. కూతురు బతుకూ తన లాంటిదే అయిందన్న బాధతో యామిని వెక్కి వెక్కి ఏడ్చింది.

“అమ్మా! ఇలా మగాడి చేతిలో ఆడది మోసపోవడం పరిపాటి అయిపోయింది. పురుషులంతా అవకాశవాదులేనా! లేక మహిళలంతా కేవలం చాపల్యంతోనే ఇలా మోసపోతున్నారా!?” అనడిగింది పావని.

“అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి స్త్రీకి ఉండదు. అప్పుడు మహిళ కేవలం ఆటబొమ్మగా ఓడిపోతుంది”


తల్లి సమాధానం విని పావని నవ్వింది.


“నువ్వు ఓడిపోయి, పారిపోవడంలో అర్థం లేదు. పరిస్థితిని నేర్పుగా చక్కదిద్దుకోవాలి. లేదా– మోసం చేసిన వాడిపై కక్ష తీర్చుకోవాలి” అంది పావని.


పావని మనసులోపలి ఆలోచన విని, యామిని గుక్కతిప్పుకోలేకపోయింది. అది తప్పని తాను చెప్పలేదు. తొలిదశలో ప్రేమ కమ్మగా ఉంటుంది. మత్తెక్కిస్తుంది. ఆ ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఎవరూ ఉండలేరు. బాధ కలిగించే పరిణామాల తరువాత ప్రేమికులు శత్రువులుగా మారిపోతారా!?

పాతతరం మనుషులు తమ కర్మ అని ఎంతటి బాధైనా, త్యాగం పేరుతో సహించేవారు గానీ– ఆధునికులు అటువంటి మనస్తత్వం కలిగి ఉండరేమో! యామినికి పావని ఆలోచనలు. ఆమె మాటలకు అర్థం ఏమిటో అప్పుడు తెలీలేదు. ఇప్పుడిప్పుడు అన్నీ అనుమానాలే!! గుంటూరు స్నేహితురాలి దగ్గరకు వెళుతున్నానని చెబితే, నిజమని నమ్మింది తాను. కల్వారను కూడా రాజమండ్రికి రప్పించుకుంది పావని? గిరిబాబు మర్డర్‌కు కూతురే కారణమా! అన్నీ ప్రశ్నలే!!

ఇంటిచుట్టూ పోలీసు నిఘా ఉందని తెలియక పావని తొందరపడి వస్తే– అరెస్ట్ కావడం ఖాయం. ఇంతకాలం కళాకారిణిగా తన మీదికి ముసురుకు వచ్చే ముప్పులను తానెంతో చాకచక్యంగా తప్పించుకుంటూ వచ్చింది. అదంతా ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరేనా? దారీతెన్నూ ఎరగని వరద గోదావరి మధ్యలో చిక్కుకున్న నావలా ఆలోచనల వెల్లువల మధ్య ఆమె.





## చోద్యం

శ్రీరంగనీతులంటే ఏమిటో సరిగ్గా తెలియజేసింది కరిష్మా. ఈ మధ్య సినిమా షూటింగ్‌కు కొంతమంది విదేశీ అమ్మాయిలు వచ్చారు. వాళ్ళు వేసుకున్న బట్టలు బాగా పలుచగా వున్నాయి. అది చూసిన కరిష్మా, అమ్మో ఇది ఇండియా ఇక్కడ ఇలాంటి బట్టలు వేసుకోవడం ఏమిటీ అని ముక్కున వేలేసుకుంది. మరి అమ్మాయిగారు తెరమీద వేసుకునే బికినీలకన్నా అధ్వాన్నమైన దుస్తుల మాటేమిటో అని చుట్టుపక్కల వారు విస్మయం చెందారు.

రెండు రోజులు ఆందోళనతోనే గడిచాయి. గుంటూరు నుంచి కల్హార తండ్రి నారాయణరావు వచ్చి, ఒక రోజుండి వెళ్ళిపోయాడు. పిల్లల ఆచూకీ తెలియలేదు. బాగా ఆలోచించాక, ఎందుకైనా మంచిదని పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ రిపోర్ట్ ఇచ్చారు.

ఈలోగా జర్నలిస్ట్ త్రినాథస్వామి రెండుసార్లు వచ్చి వెళ్ళాడు.

"నా మనస్సేం బావుండలేదు. మీరిలా మాటిమాటికీ రావడం మర్యాద కాదు" అంటూ యామిని కొంచెం కఠినంగానే చెప్పింది.

ఒకరోజు అర్ధరాత్రి దాటాక మంచం దగ్గర అలికిడైతే, కళ్ళు విప్పి చూసింది యామిని!

ఎదురుగా పావని!

కళ్ళు నులుముకు మరీ చూసినా- అవును పావనే!!

"నన్ను క్షమించమ్మా!" అంది పావని

యామిని ఏం మాట్లాడలేదు.

అమ్మాయి ముఖంలోకి పరిశీలనగా చూసింది- పావని ఎంతో ప్రశాంతంగా ఉంది. రవంత ఆందోళన కూడా లేదు.

"నిన్నెంతో కష్టపెట్టాను. నేనేమైపోయానో తెలీక పోలీస్ రిపోర్టు కూడా ఇచ్చావు-"

యామిని వింటోంది.

"కల్హార, నేను క్షేమంగా ఉన్నానమ్మా-" అంది నవ్వుతూ పావని.

"పత్రికల్లో వార్తలు చదివి కంగారు పడ్డావా అమ్మా" అనడుగుతూ తల్లి కంఠాన్ని పసిబిడ్డలా కౌగలించుకుంది పావని.

"ఊహలూ, కట్టుకథలూ నువ్వు నమ్మవని నాకు తెలుసు- నేనెప్పుడూ తొందరపడి ఏమీ చేయనని కూడా నీకు తెలుసు-"

కన్నబిడ్డ కళ్ళల్లోకి నిశ్చలంగా చూస్తోంది యామిని.

"మా గురించి నువ్వేమీ భయపడొద్దు. ఇప్పుడు మేము పోలీసుల కంటబడితే అంతా ప్రమాదమే. కొన్నాళ్ళపాటు మేము దూరంగా వెళ్ళిపోతాం. మేమేమీ అఘాయిత్యం చేయము. గిరిబాబు క్షేమంగా ఉన్నాడు. అతన్ని మేమే కిడ్నాప్ చేశాం. మా బృందం మొత్తం నలుగురం. గిరిబాబును పెళ్ళి చేసుకుని తీరతాను. ఒకవేళ అతను నన్ను మోసం చేయాలనుకుంటె- అందుకు తను ఫలితం అనుభవిస్తాడు. ఎవరైనా ఏదైనా అడిగితే- నాకేం తెలీదని, అమ్మాయి సంగతి తెలీదని మాత్రం చెబితే చాలు..."

ఎంతో ధైర్యంగా చెబుతున్న కూతురును ఆప్యాయంగా కౌగలించుకుంది యామిని. గోద్రెజ్ బీరువా తెరచి డబ్బిచ్చింది.

"జాగ్రత్తమ్మా! పోలీసులు నిఘావేసి ఉంచారు" అని చెప్పింది.

ఎలా వచ్చిందో అలా వెళ్ళిపోయింది పావని. ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయింది యామిని.

మర్నాడు పొద్దుటే ఎస్సై నలుగురు కానిస్టేబుళ్ళతో వచ్చాడు.

"మీ ఇల్లు సెర్చి చేయాలి" అన్నాడు ఎస్సై.

"విదౌట్ వారెంట్ ఐ వోంట్ అలౌయూ టు సెర్చి మై హోమ్" అంది యామిని.

ఎస్సై ఉగ్రుడయ్యాడు.

"నా పావని కనిపించక నేను తల్లడిల్లిపోతుంటే- మీరేంటండీ మమ్మల్ని దొంగల్ని చేస్తారు?" అని నిలదీసింది.

శివశంకరమూర్తి చేతిలో లాఠీ గిరగిరా తిరిగింది.

"రాత్రి పావని మీ ఇంటికి వచ్చింది" అన్నాడు మూర్తి.

"వచ్చింది- వస్తే ఏమౌతుంది? కట్టు కథలతో బుకాయించడం మీకు అలవాటే కదా!" గట్టిగానే చెప్పింది యామిని.

ఏం చేయాలో తెలీక, మూర్తి వెళ్ళిపోయాడు.

ఓ అరగంటకు ఫోన్‌లో స్వామి కంఠం- "హలో, యామినిగారూ! పోనీలెండి- మీ అమ్మాయి క్షేమంగా ఇక్కడే ఉందని తెలిసింది-" అంటూ పలకరింపుగా.

యామిని ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకాయి.

మాట్లాడకుండా రిసీవర్ క్రెడిల్ చేసింది.

క్రమంగా చీకటి పడుతోంది. ఒక్కొక్కటిగా ఇళ్ళన్నీ విద్యుద్దీపాల వెలుగులు నింపుకుంటున్నాయి.

యామిని చీకట్లోనే కూచుంది. లేచి స్విచ్ వేయాలనుకుంది. పవిత్ర బయటికెక్కడికో వెళ్ళింది.

ఫోన్ మోగింది. యామిని చెవిలో శబ్దాలు కరిగిపోతున్నాయి.

ఫోన్ మోత ఆగిపోయింది. పది నిమిషాల తరువాత మళ్ళీ ఫోన్. అప్పుడే వచ్చినట్టుంది. పవిత్ర రిసీవర్ అందుకుంది.

"ఒక్క నిమిషం" అని, "అమ్మా గాంధీగారంట" బిగ్గరగా అంది పవిత్ర.

చివ్వున లేచింది యామిని. గాంధీ మాటలు మెత్తగా వినబడుతున్నాయి.

"నాకు తెలుసు యామిని గారూ! అంతా సుఖాంతంగా సాగుతుంది."

యామిని ముఖం మీద వెలుగుతున్న చిరునవ్వు వంక అప్పుడే కాంతివంతమైన ట్యూబ్‌లైట్ దీప్తిలో పవిత్ర చూసింది.

గాంధీ చెబుతున్నాడు-

"కోరిక మనస్సును ఉత్తేజితం చేస్తుంది. అప్పుడెంతో ఆనందంగా ఉంటుంది. బలపడేకొద్దీ ఒక్కోసారి అది దుఃఖం కలిగిస్తుంది. మనస్సును చికాకు పరుస్తుంది. నిరాశ కలిగిందా- మనస్సు నిప్పుల కుంపటి అవుతుంది. నిస్పృహతో కక్ష పెరుగుతుంది. కొందరు ఎంత బాధనైనా సహిస్తారు. కొందరి వల్ల కాదు- ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటారు. వ్యవహారం హత్య వరకూ వెళ్ళే ప్రమాదం ఏర్పడుతుంది. సోమర్ సెట్ మామ్ 'రైటర్స్ నోట్‌బుక్'లో ఈ విషయం నేనెప్పుడో చదివాను. ఇదే నా కొత్త నవలకు ఇతివృత్తం"

"రచయితలకు ఒక్కోసారి ముగింపు దొరకదు. ఊహ చిత్రంగా ఉంటుంది. వాస్తవంగా జరిగేది అందుకు విడ్డూరం కావచ్చు" అంది యామిని.

"నా నవలలో పాత్రల పేర్లు మారుస్తానులెండి- అన్నట్టు మీ అమ్మాయిని కలుసుకున్నాను. అన్నీ భరించి, నన ఖర్మ అనుకునే మనస్తత్వం కాదు ఆమెది. కోరుకున్నది సాధించుకునే నేర్పుంది"

యామిని ఒక్క క్షణం తొట్రుబాటుతో ఉక్కిరిబిక్కిరైంది. కొంచెం తమాయించుకుంటూ, ఇలా అంది- "జర్నలిస్టులు సంచలనం కోరుకుంటారట! రచయితలకు సంయమనం అధికం కావచ్చు. సామాజిక ప్రయోజనం కోరుకునే బాధ్యత గల రచయిత ఏమాత్రం తొందరపడడు. కళాకారిణిగా నా అనుభవం చిన్నదే. అయినా ఒక చిన్న కోరిక- మీ అక్షరాలు ఎవరికీ అపకారం చేయకుండా ఉంటే- మీ మేలు ఎన్నటికీ మరవను"

"మీ అభిప్రాయాలను పూర్తిగా సమర్థించలేను" అంటూ గాంధీ నవ్వేడు. నవ్వుతూనే- "మీ మిత్రుడితో నా స్నేహం పరిమితమైందే. ఆ రోజున మేమిద్దరం కలసి రావడం యాదృచ్ఛికమే! అంతా గమనిస్తున్నాను. ఫోన్ చేసి విసిగించడం నాకిష్టం ఉండదు" అన్నాడు.

"ఎప్పుడైనా తీరిక చేసుకుని ఒకసారి రండి" అని ఆహ్వానించింది యామిని.

"ఇప్పుడు వద్దులెండి! పోలీస్ డాగ్ విల్ ఛేజ్ మి" అంతా సుఖాంతమయ్యాక- అప్పుడు చెప్పకుండా వస్తాను- భోజనానికి. అత్యవసర సమయాల్లో తెర అవసరం అని కళాకారిణిగా మీకు తెలును"

ఫోన్ క్లిక్‌మంది. నాలు కుర్చీలో యామిని ప్రశాంతంగా వెనక్కు వాలింది.